www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 27 ఏప్రిల్ 2025

రేపటి నుంచి వేసవి శిక్షణ శిబిరం : జెవివి

మాట్లాడుతున్న ప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి: ప్రతి సంవత్సరం వేసవిలో పిల్లలకోసం నిర్వహిస్తున్న వేసవి శిబిరం సోమవారం నుంచి పట్టణంలోని విజ్ఞాన్ స్కూల్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు జన విజ్ఞానం వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌రెడ్డి పేర్కొ న్నారు. శనివారం విజ్ఞాన్ హై స్కూల్‌లో జన విజ్ఞాన వేదిక నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాష్‌రెడ్డి మాట్లా డుతూ ప్రతి రోజూ ఉదయం 9 గంటలకు శిక్షణ శిబిరం ప్రారంభమవుతుందని తెలి పారు. 14 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన పిల్లలందరూ పాల్గొనవచ్చునని అన్నారు. విద్యార్థులకు పేపర్ క్రాఫ్ట్, మట్టితో బొమ్మలు చేయడం, పెయింటింగ్, సైన్స్ ప్రయోగాలు, సరదాగణితం, క్విజ్, ఆట పాట లతో కార్యక్రమాలు ఉచితంగా నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో జనవిజ్ఞాన వేదిక నాయకులు బయారెడ్డి, ఓబుల్ రెడ్డి, రవీంద్ర నాథరెడ్డి, వైసి.రెడ్డెప్ప రెడ్డి, రాజశేఖర్, శివ పాల్గొన్నారు.

ములకలచెరువులో విషాదం

- నీట మునిగి నలుగురు మృత్యువాత
- చెరువులో దుస్తులు ఉతుకుతుండగా ప్రమాదం
- మృతుల్లో ముగ్గురు ఒకే కుటుంబానికి చెందిన వారు

నీట మునిగి మృతి చెందిన నందిత, మల్లేష్, లావణ్య, నందకిషోర్

ప్రజాశక్తి-ములకలచెరువు

అన్నమయ్య జిల్లా ములకలచెరువులో విషాదం నెలకొన్నది. చెరువులో బట్టలు ఉతకడానికి వెళ్లి ఒకే కుటుం బానికి చెందిన నలుగురు ప్రమా దవశాత్తు నీట మునిగి ప్రాణాలు కోల్పోయారు. తండ్రితోపాటు ముగ్గురు పిల్లలు మృత్యువాత పడటంతో గ్రామంలో విషాదఛాయలు అలుము కున్నాయి. స్థానికులు, పోలీసుల కథనం మేరకు...శనివారం మధ్యాహ్న సమ యంలో దుస్తులు ఉతికేందుకు చెరువు వద్దకు ఓ కుటుంబం వెళ్లింది. మండ లంలోని దందువారిపల్లి కుట్టడం నిర్మించిన కాలనీలో ఈశ్వరమ్మ, మల్లేష్ దంప తులు నివాసం ఉంటున్నారు. ఈశ్వరమ్మ, మల్లేష్ దుస్తులు ఉతికేందుకు సమీపంలోని పెద్దచెరువుకు వెళ్తుండగా వారి ఇద్దరు పిల్లలు లావణ్య, నందకి షోర్‌లతో కలిసి ఇంటి పక్కలో ఉన్న నందితాతో కలిసి చెరువు వద్దకు వెళ్లారు. చెరువు నీటి కుంటలో పిల్లలు లావణ్య(12), నందకిషోర్(9), నందిత(10) అడు

చెరువులో ఈతకొడుతున్న లావణ్య, నందకిషోర్

కుంటూ లోతులోకి జారుకొని మునిగి పోయారు. వారిని గమనించిన మల్లేష్ కాపాడేందుకు చెరువు కుంటలోకి దూకాడు. చెరువు కుంట లోతుగా ఉండడంతో పిల్లలతో పాటు మల్లేష్ మునిగిపోయాడు. ఈశ్వరమ్మ కేకలు వేయడంతో లాభం లేకపోయింది. చీకటి కావడంతో అటువైపు స్థానికులు సంచారం లేకపోయింది. అక్కడ నుంచి రాజీవ్ కాలనీలోకి వెళ్లి స్థానికులకు సమాచారం అందించింది. వారు పోలీసులకు, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది చెరువులోకి దిగి వారిని కాపాడే ప్రయత్నం చేశారు. అప్పటికే నలుగురు మృత్యువాత పడ్డారు. చిన్నారులు నీటి మునిగి మృతి చెందిన విషయం గ్రామంలోనికి దావానంలా వ్యాపించడంతో ప్రజలు పెద్దఎత్తున అక్కడికి చేరుకున్నారు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆర్థికాభివృద్ధికి పర్యాటక రంగమే కీలకం

- కలెక్టర్ చామకూరి శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

అన్నమయ్య జిల్లా ఆర్థిక అభివృద్ధికి సాంస్కృతిక పరిరక్షణకు పర్యాటక రంగం అభివృద్ధి కీలకమని, ముఖ్యమైన పర్యాటక కేంద్రాలలో హోం స్టేల నిర్మాణం జరగాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. శనివారం రాయచోటి కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పర్యాటక కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సమావేశాన్ని జిల్లా పర్యాటక శాఖ అధికారి నాగభూషణం ప్రారంభిస్తూ జిల్లాలో చేపడుతున్న వివిధ పర్యాటక ప్రాజెక్టులకు భూమి కేటాయింపు, ఒక జిల్లా ఒక పర్యాటక ప్రాజెక్టు కింద జిల్లాలో చేపట్టబోయే ప్రాజెక్టు, హార్సిలీహిల్స్‌లో చేపట్టబోయే వివిధ ప్రాజెక్టులు, అన్నమాచార్యుల వారి గురించి, అన్నమాచార్య కీర్తనలను ప్రచారం చేయడం, రాయచోటిలో శిల్పారామ నిర్మాణంలో ప్రగతి, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాయచోటి, పీలేరు, రాజంపేటలలో నిర్మించబోయే మూడు నక్షత్రాల హోటళ్లకు ఒక్కొక్క చోట గుర్తించబడిన 5 ఎకరాల భూములను పర్యాటక శాఖకు అప్పగించే దిశగా చర్యలు చేపట్టాలని సబ్ కలెక్టర్లను ఆదేశించారు. హార్సిలీహిల్స్‌లో గిరిజన కార్పొ రేషన్ వారు అరకు కాఫీ కోసం గుర్తించిన స్థలాన్ని గిరిజన కార్పొరేషన్‌కు అందించేందుకు చర్యలు తీసుకోవాలని మదనపల్లె సబ్ కలెక్టర్‌ను ఆదేశించారు. హార్సిలీహిల్స్‌లో లేపాక్షి స్టాల్ ఏర్పాటుకు స్థలాన్ని గుర్తించి పర్యాటక శాఖకు అందజేయాలని ఆదేశించారు. స్వయం సహాయక బృందాలతో హోమ్ స్టేలను నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని డిఆర్‌డిఎ పీడీని ఆదేశించారు. హోమ్ స్టేలను గుర్తించిన అనంతరం ఓయో, ఇతర ఆన్‌లైన్ వెబ్సైటులకు లింక్ చేసి పర్యాటకులకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. గుర్రంకొండ ఫోర్ట్, హార్సిలీహిల్స్, వెలిగల్లు, కోడూరులోని రెడ్‌వుడ్ పార్క్, తదితర పర్యాటక ప్రదేశాలలో సానిటరీ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేసేందుకు ఒక్కొక్క చోట ఒక్కో సెంటును పర్యాటక శాఖకు అందజేయాలని సంబంధిత రెవెన్యూ అధికారులను ఆదేశించారు. రాయచోటి దగ్గర నిర్మించబడుతున్న శిల్పారామం నిర్మాణంలో పురోగతి సాధించాలని పర్యాటకశాఖ అధికారిని ఆదేశించారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, మదనపల్లె, రాజంపేట సబ్ కలెక్టర్లు మేఘ స్వరూప్, నైదియా దేవి, పర్యాటకశాఖ రీజనల్ డైరెక్టర్ రమణ ప్రసాద్, ఎపిటిడిసి ఇఇ సుబ్రహ్మణ్యం, జిల్లా పర్యాటకశాఖ అధికారి నాగభూషణం, డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ ఎపిఎస్ఆర్‌టిసి జిల్లా అధికారి రాము, జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారి విశ్వనాథ్, మదనపల్లె మున్సిపల్ కమిషనర్ ప్రమీల, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పశువైద్యుల సేవ అభినందనీయం : జెసి

సమావేశంలో మాట్లాడుతున్న జెసి ఆదర్శ రాజేంద్రన్

ప్రజాశక్తి-రాయచోటి

మూగజీవాల ఆరోగ్య సంరక్షణలో పశువైద్యుల సేవలు అభినంద నీయమని జెసి ఆదర్శ రాజేంద్రన్ పేర్కొన్నారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్లో జెసి అధ్యక్షతన జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ పశు వైద్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లా డుతూ పశువైద్యుల సేవలను గౌరవించడం, పశువుల ఆరోగ్య సంరక్షణలో వారి పాత్రను గుర్తించడానికి ప్రపంచ పశు వైద్య దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం ఏప్రిల్ చివరి శనివారం రోజున జరుపుకుంటున్నామని అన్నారు. రాష్ట్రంలో గ్రామీణ ప్రజల ముఖ్య జీవనాధారం వ్యవసాయం, పశు పోషణ అని పేర్కొ న్నారు. పశు పోషణలో రైతులకు గొర్రెలు, మేకలు, పందుల మాంసం, కోళ్ల నుంచి గుడ్లు, మాంసం ఉత్పత్తితో పెంపకందారులకు ఆదాయం లభిస్తుందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కొన్ని కోట్ల మూగజీ వాలకు పశువైద్య సిబ్బందే కొండంత అండగా నిలుస్తున్నారని అన్నారు. పశు ఆసుపత్రుల్లో మందులు పంపిణీ చేయడంతో పాటు వాటి పునరుత్పత్తికి కృత్రిమ గర్భధారణ, శస్త్రచి కిత్సలు, వ్యాధి నిరోధక టీకాలు, సంచార వాహనాల ద్వారా పశువులకు ఇంటి వద్దే అత్యవసర వైద్య సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. మూగ జీవాలను చీదరించుకోకుండా విశిష్ట సేవలు అందిస్తున్న పశువైద్యులను గౌరవించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. డిఆర్ఓ మధుసూదన్‌రావు మాట్లాడుతూ పశు వైద్యులు కేవలం జంతు వైద్యులు మాత్రమే కాదని, ప్రజారోగ్య రక్షణలో ఫ్రంట్ లైన్ వారియర్స్ అని కొనియాడారు. గ్రామీణ ప్రాంతంలో ప్రజలు, పశువులు కలిసి జీవించడం జరుగుతుందని, పశువుల ఆరోగ్యం బాగుంటేనే గ్రామీణ ప్రజల ఆరోగ్యం బాగుంటుందన్నారు. తనకు స్వతహాగా మూగజీవాలంటే ప్రేమ అని, తనకు కూడా పశు వైద్యం అంటే ఇష్టమని అనుకొని పరిస్థితులలో రెవెన్యూ శాఖ అధికారిగా పనిచేస్తున్నానని అన్నారు. మూగజీవాలు కేవలం గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మాత్రమే సేవలందించడం లేదని, పోలీసు శాఖ అధికారులకు శాంతి భద్రతల పరిరక్షణలో విశేష సేవలు అందిస్తున్నాయన్నారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి గుణశేఖర్ పిళ్లై మాట్లాడుతూ మూగ జీవాల సంరక్షణలో ఉన్న పశుసంవర్ధక శాఖ అధికారిగా ఉన్నందుకు, వాటి సంరక్షణ, పోషణలో భాగమైనందుకు ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ సంవత్సరం పశువైద్య దినోత్సవాన్ని 'యానిమల్ హెల్త్ టేక్స్ ఎ టీం' అనే నినాదంతో జరుపుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ మూగజీవాలకు సేవలు అందించడం ఎంతో ఆనందం కలిగిస్తుందని పేర్కొన్నారు. జిల్లాలోని పలు పశువైద్యశాలలలో మరుగుదొడ్లు సరిగా లేవని, వాటికి తగిన చర్యలు తీసుకోవాలని డిఆర్ఒను కోరారు. సమావేశంలో మదనపల్లి, రాజంపేట, రాయచోటి ఉపసంచాలకులు సత్యనారాయణరావు, విజయభాస్కరరావు, విజయకుమార్, సహాయ సంచాలకులు, జిల్లాలో పనిచేస్తున్న పశు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉగ్రవాదాన్ని రూపుమాపాలి : సిపిఎం

ఉగ్రవాదుల చర్యకు నిరసన తెలుపుతున్న సిపిఎం, ప్రజాసంఘాల ప్రతినిధులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాం ప్రాంతంలో అమాయక పర్యాటకులపై విచక్షణా రహితంగా కాల్పులు జరిపి దేశంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన ఉగ్రవాదాన్ని తరిమికొట్టాలని అన్నమయ్య జిల్లా సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. జమ్మూకాశ్మీర్‌ను కాపాడుకోవాలని, అక్కడ శాంతియుత వాతావరణం నెలకొల్పాలని అన్నారు. శనివారం స్థానిక బెసెంట్ సర్కిల్‌లో ఉగ్రవాదుల దారుణ మారణకాండను ఖండించండి.. మతసామరస్యాన్ని కాపాడుకుందాం అని కోరుతూ కార్మిక, రైతు, ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. పహల్గాం మృతులకు నివాళి అర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. ఉగ్రవాదం నశించాలి, మత సామరస్యాన్ని కాపాడాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం శ్రీనివాసులు మాట్లాడుతూ ఉగ్రవాదుల కాల్పుల్లో 26 మంది ప్రాణాలు పొగొట్టుకున్నారని, అమాయకమైన ప్రజలను ఉగ్రవాదులు హతమార్చడం దారుణమని అన్నారు. ఈ దాడిని సిపిఎం తీవ్రంగా ఖండిస్తోందని, మృతుల కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేస్తోందన్నారు. దేశవ్యాప్తంగా కులాలు, మతాలు, ప్రాంతాలకు అతీతకంగా ఈ చర్యలను ఖండించాలని, దేశ ప్రజలంతా ఒక్క తాటిపైకి వచ్చి ఉగ్రవాదాన్ని ఎదుర్కోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం తీసుకున్న చర్యలు ఏ మాత్రమూ సరిపోవన్నారు. కాశ్మీర్‌లో భద్రత సరిగా లేదని విమర్శించారు. ఉగ్రవాద వ్యతిరేక ఉద్యమం నిర్మించాలని, దీనికి మతం రంగు పులమకూడదని అన్నారు. ఉగ్రవాదానికి మతం, కులం, లేదన్నారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు నారాయణ, నాగరాజు, రామకృష్ణ, రాజు, చలపతి, కృష్ణప్ప పాల్గొన్నారు.

యుపిఎస్ఎఫ్ ఆధ్వర్యంలో..: ఉగ్రదాడులకు నిరసనగా అన్-ఎయిడెడ్ ప్రైవేట్ స్కూల్స్ రాష్ట్ర ఫెడరేషన్ యుపిఎస్ఎఫ్ -ఎపి ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాద చర్యలను ఖండిస్తూ, భారతీయుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ బెంగళూరు బస్టాండ్ నుంచి పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. యుపిఎస్ఎఫ్ ఎపి అనుబంధ పాఠశాలలైన, న్యూక్రిసెంట్ స్కూల్, ఉషోదయస్కూల్, రాయలసీమ చిల్డ్రన్స్ అకాడమీ స్కూల్, శ్రీ శారదా విద్యానికేతన్ స్కూల్, ఆక్స్‌ఫర్డ్ ఇంటర్నేషనల్ స్కూల్, శ్రీ విద్యానికేతన్ స్కూల్, సన్ రైజ్ స్కూల్, తాజ్ స్కూల్ కరెస్పాండెంట్లు,ఉపాధ్యాయ ఉపాధ్యాయిని బృందం, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని ఉగ్రవాదం నశించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ప్రవీణ్ కంటి మహంతి మాట్లాడుతూ దేశంలో ఉగ్రవాదాన్ని అంతమొందించాలని కేంద్రాన్ని విజ్ఞప్తి చేశారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న దేశాలపై ఐక్యరాజ్యసమితి కఠిన ఆంక్షలు విధించాలని డిమాండ్ చేశారు.

ఉచిత కంటి పరీక్షలు చేసుకున్న లబ్ధిదారులు

25 మందికి ఉచిత కంటి శస్త్ర చికిత్స

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె లయన్స్ క్లబ్‌లో 25 ఉచిత క్యాటరాక్ట్ సర్జరీలు నిర్వహిం చినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ నివేదిత, జోనల్ చైర్మన్ డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి పేర్కొన్నారు. స్థానిక లయన్స్ కంటి ఆసుపత్రిలో శనివారం ఉచిత క్యాటరాక్ట్ సర్జరీలు పూర్తి చేసుకొన్న వారికి వైద్యులు సూచనలు, మందులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆఫ్ మదనపల్లి ప్రత్యేక కార్యాచరణలో ఉచిత కంటి శస్త్ర చికిత్సలు నిరంతరం కొనసా గుతున్నాయన్నారు. ఈ సేవలు అవసరమైన ప్రజలు సద్వినియోగం చేసుకో వాలని తెలిపారు. గ్రామీణ, పట్టణ పేద ప్రజలు అంధత్వంతో ఇబ్బంది పడకుండా వారి కుటుంబాల్లో వెలుగులు నింపడం కోసమే లయన్స్ క్లబ్ ఎల్లప్పుడు ముందుంటుందని పేర్కొన్నారు. ఇందుకోసం తరచు ఉచిత కంటి పరీక్ష శిబిరాలు నిర్వహిస్తూ కంటి సమస్యలు ఉన్న వారిని గుర్తించే కార్యక్రమం ముందుకు సాగుతోందని అన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పిఆర్ఓ లయన్ గౌతమ్‌రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సుధాకర్‌కు డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి-మదనపల్లె

రఘునాథరెడ్డి నుంచి డాక్టరేట్ స్వీకరిస్తున్న సుధాకర్

పట్టణంలోని అక్షర ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకులు సుధాకర్‌కు గౌరవ డాక్టరేట్ పొందినట్లు శనివారం ఆయన తెలిపారు. రామసముద్రం మండలంలోని చంబకూరు గ్రామం కోటవీధికి చెందిన సరస్వతమ్మ, వెంకటం మణకు 1983వ సంవత్సరంలో వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. చిన్నప్పటి నుంచి చదువు మీద ఉన్న శ్రద్ధతో వ్యవసాయంలో తల్లిదండ్రులకు సహకారం అందించి తన విద్యను కొనసాగించానని తెలిపారు. ఎంకామ్ ఎన్‌వి యానివర్సిటీ నుంచి, ఎంబిఎ అన్నా యూనివర్సిటీ నుంచి పట్ట పొందినట్లు చెప్పారు. బోధనపై ఉన్న గౌరవం, ఇష్టంతో వివిధ ప్రయివేట్ కళాశాలలో బోధన చేస్తూ సొంతంగా అక్షర ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ సొసైటీ స్థాపించి దాని ద్వారా కొన్ని వేల మందికి విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. పేద పిల్లలు, అనాథ బాలలకు అనాథ స్వచ్ఛంద సేవా సంస్థల ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వివిధ సంస్థల నుంచి మాన్ ఆఫ్ లెటర్స్ అవార్డు పొందానని అన్నారు. తన సేవలను గుర్తించి డిల్లీకి చెందిన సెల్యూట్ అచీవర్స్ సొసైటీ గౌరవ డాక్టరేట్ ను ప్రదానం చేశారని తెలిపారు. ఈ డాక్టరేట్ ను తన గురువు విశ్వం డిగ్రీ అండ్ పీజీ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ రఘునాథరెడ్డి చేతుల మీదుగా అందుకున్నట్లుతెలిపారు. డాక్టరేట్ పొందిన సుధాకర్‌కు గ్రామ ప్రజలు, వివిధ ప్రముఖులు, స్నేహితులు, సహాధ్యాపకులు అభినందనలు తెలిపారు.

28 నుంచి ఉచిత హాకీ సమ్మర్ కోచింగ్ క్యాంప్

ప్రజాశక్తి-మదనపల్లె

స్థానిక ప్రభుత్వ బిటి కళాశాల హాకీ గ్రౌండ్‌లో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ సెక్రెటరీ ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి ఉచిత హాకీ సమ్మర్ కోచింగ్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ అధికారి తెలిపారు. ఈ నెల 28 నుంచి 30 వరకు ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి 8 గంటలకు వరకు, సాయంకాలం 4.30 గంటల నుంచి 6 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. ఈ క్యాంప్‌లో పాల్గొనే పిల్లలు 8 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాలు లోపు ఉన్నవారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈసమ్మర్ కోచింగ్ వల్ల ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ క్యాంపునకు కోచ్‌గా నౌషాద్, సీనియర్ క్రీడాకారులు వ్యవహరిస్తారని అన్నారు. ఇతర వివరములకు 9492377889, 7386898900 ఫోన్ నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

హార్సిలీహిల్స్ ఘాట్ రోడ్డులో చిరుత సంచారం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ ఘాట్ రోడ్డులో చిరుతపులి సంచారం కలకలం రేపుతోంది.అర్ధరాత్రి సమయంలో కిందకు వస్తున్న పర్యాటకుల వాహనాలు చిరుత పులి తారసపడినట్లు చెబుతున్నారు. మూడవ మలుపు తిరుగుతున్న సమయంలో ఎడమవైపు నుంచి కుడివైపు రోడ్డు దాటుతుండగా కారు డాష్ కెమెరాలో చిరుతపులి రికార్డు అయ్యాయి. ఇటివల కాలంలో మదనపల్లిలోని పొన్నీటి పాళ్యంలో ఉచ్చులో పడి చిరుత మృతి చెందిన సంగతి విదితమే. తాజాగా మండలంలోని చలిమామిడి అటవీ ప్రాంతంలో రోడ్డుపై చిరుత పులి కనిపించడంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. అటవీశాఖ అధికారులు చిరుత పులి కదలికలపై నిఘాఉంచి దానిని బంధించి రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ఘాట్ రోడ్డులో రోడ్డు దాటుతున్న చిరుతపులి

మాట్లాడుతున్న ఎఎస్‌పి ఎం.వెంకటాద్రి

నేరస్తులకు శిక్షపడేలా చర్యలు : ఎఎస్‌పి

ప్రజాశక్తి-రాయచోటి టౌన్ : నేరస్తులకు శిక్షపడేలా పటిష్టమైన సాక్ష్యాధారాలతో కోర్టులో హాజరుపరచాలని ఎఎస్‌పి వెంకటాద్రి పేర్కొన్నారు. శనివారం పోలీసు ప్రధాన కార్యాలయంలో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించాలని తీవ్రమైన కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని ఆదేశించారు. శాస్త్రీయ ఆధారాలను సేకరించడం పై దృష్టి పెట్టాలని కోరారు. నేరస్తులను శిక్షపడేలా పటిష్టమైన సాక్ష్యాధారాలతో నిర్దిష్ట గడువులోగా కోర్టులో దాఖలు చేయాలని కోరారు. రాత్రి సమయాల్లో జరిగే దొంగతనాలు, నేరాలు అరికట్టడంలో బీట్ పోలీసులు రక్ష బృందాలు అప్రమత్తంగా ఉండాలని గస్తీ ముమ్మరం చేయాలని సూచించారు. రహదారి భద్రతపై ప్రత్యేక దృష్టి సారించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎక్కువగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి పరిష్కార మార్గాలు చూడాలని తెలిపారు. కార్యక్రమంలో రాజంపేట ఎఎస్‌పి మనోజ్ రామనాథ్ హెగ్డే, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

డిప్యూటీ స్పీకర్‌గా రఘురామ కృష్ణంరాజు అనర్హుడు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

నీతి, నిజాయతీకి నిలువెత్తు నిదర్శనం కమ్యూనిస్టులేనని, మీకు తెలియకపోతే మీ వాళ్లని అడగండి.. లేకుంటే మీ పార్టీ నేతలను అడిగి తెలుసు కోండి' అని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు డిప్యూటీ స్పీకర్ రఘురా మకృష్ణరాజుకు సూచించారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో శ్రీనివాసులు మాట్లాడుతూ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీని వాసరావుపై రఘురామకృష్ణరాజు వ్యాఖ్యలు అవమానకరంగా, అసభ్య కరంగా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుడిసెలు తొలగించి అభివృద్ధి అంటే ఎవరూ హర్షించరన్నారు. ప్రభుత్వ పోరంబోకు భూముల్లో ఇళ్లు వేసు కుంటే వారికి పట్టాలు ఇవ్వాలని, కోర్టు తీర్పులు, ప్రభుత్వాలు, జిఒలు చెబుతు న్నాయనే విషయాలు తెలుసుకోవాలన్నారు. అసభ్య పదజాలాన్ని ఉపయోగించే వ్యక్తి డిప్యూటీ స్పీకర్ పదవికి అనర్హుడని, పశ్చిమ గోదావరి జిల్లాలో పేదల గుడిసెలు తొలగింపుకు నిరసనగా గలమెత్తిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శిపై అనుచిత వాక్యలు చేయడమే కాకుండా, బతికి పోయావంటూ చేసిన తాటాకు చప్పుళ్లకు కమ్యూనిస్టులు బెదిరిపోరన్నారు. రఘురామకృష్ణరాజు డిప్యూటీ స్పీకర్‌గా అనర్హుడని, వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు.

బేషరతుగా క్షమాపణ చెప్పాలి

రాయచోటి టౌన్: ప్రజా ఉద్యమాల సారథి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివా సరావుకు రఘురామ కృష్ణంరాజు బేషరతుగా క్షమాపణ చెప్పి నోటిని శుద్ధి చేసుకో వాలని సిపిఎం శ్రేణులు డిమాండ్ చేశాయి. శ్రీనివాసరావుపై రఘురామ కృష్ణంరాజు చేసిన అనుచిత వ్యాఖ్యలను సిపిఎం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా కమిటి సభ్యులు ఎ.రామాంజులు మాట్లాడారు. అబద్ధాలు, అనుచిత వ్యాఖ్యల ద్వారా సమస్యలు పరిష్కారం కావని చిత్తశుద్ధి ఉంటే సక్రమంగా సమాధానం చెప్పాలన్నారు. నిరంతరం ప్రజల పక్షాన ప్రజల సమస్యలను ప్రభుత్వానికి తెలియజేసే సిపిఎంపై ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు అధికారమదంతో మాట్లాడిన మాటలు సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయని విమర్శించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు నాగబసిరెడ్డి, ఈశ్వరయ్య, రైతుసంఘం నాయకులు రామకృష్టారెడ్డి పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఇ ఏర్పాటుకు భూములు గుర్తించాలి : కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజల సంక్షేమ ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలలో వంద శాతం లక్ష్యాలను సాధిం చాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం రాయచోటి కలెక్టరేట్ మినీ విసి హాల్ నుండి రెవెన్యూ, సామాజిక పింఛన్లు, తాగునీరు, జిఎస్‌డబ్ల్యుఎస్, గృహ నిర్మాణం, డ్వామా, పంచాయతీరాజ్, పారిశుద్ధ కార్యక్రమాలు తదితర అంశాలపై మండల అధికారులతో విసి ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించి తీసుకో వాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ పౌరులకు మెరుగైన రెవెన్యూ సేవలను అందించాలన్నారు. ఇంటి నిర్మాణం కొరకు జారీ చేసే పొజిషన్ సర్టిఫికెట్ల జారీలో వెనకబడిన మండలాల తహశీల్దార్లతో ఆర్‌డిఒ, సబ్ కలెక్టర్లు స్వయంగా సమీక్షించి ఒక వారంలోగా పెండింగ్ పూర్తిచేయాలని సూచించారు. హౌసింగ్ రీ వెరిఫికేషన్ పెండింగ్ కూడా త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రతి మండలంలో ఎంఎస్ఎంఇ పార్కుల ఏర్పాటుకు ఫీజబిలిటీ నివేదికను కూడా వెంటనే పంపాలని సూచించారు. జిల్లాలో పచ్చి మేత పెంపకానికి డివిజన్ మండల స్థాయిలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ, డికేటీ ప్రైవేట్ భూములను ప్రతి మండలంలో కనీసం 3వేల ఎకరాలను గుర్తించా లిన్నారు. ప్రభుత్వం జారీ

బాధిత రైతుకు చెక్కును అందిస్తున్న అటవీశాఖ అధికారులు

పులిదాడిలో మేకను నష్టపోయిన రైతుకు పరిహారం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండలంలో గత సంవత్సరం నవంబర్ నెల 8న జరిగిన పులి దాడి సంఘటనలో మేకను నష్టపోయిన రైతుకు శనివారం మదనపల్లె అటవీశాఖ కార్యాలయంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ జి.జయప్రసాదరావు, డిప్యూటీ రేంజ్‌ఆఫీసర్ జై.మదనమోహన్ నష్టం పరిహారం చెక్కును అటవీశాఖ అధికారులతో కలసి పంపిణీ చేశారు. మండలంలోని ముష్టూరు పంచాయతీ, పారేశువారిపల్లెకు చెందిన రైతు పి.రామయ్య గత ఏడాది నవంబర్ 8వ తేదీన తన మేకలను సమీపంలోని గుట్టకు తోలు కెళ్ళి మేపుతుండగా పులి దాడి చేసి ఓ మేకను చంపడం జరిగిందన్నారు. ఈ ఘటనతో ఆ కుటుంబం అడవి జంతువు కారణంగా కుటుంబానికి ఆధారమైన ఒక మేకను కోల్పోయిందన్నారు. బాధిత రైతుకు పరిహారం చెల్లింపు కోసం అటవీశాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపినట్లు తెలిపారు. బాధిత రైతును ఆదుకునేందుకు ప్రభుత్వం నష్టపరిహారం కింద మంజూరు చేసిన రూ.7500లు నష్టపరిహారం చెక్కును బాధిత రైతుకు అటవీశాఖ అధికారులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఫ్‌బిఒ దీప, రైతు పాల్గొన్నారు. ఎఫ్‌బిఒ దీప, రైతు పాల్గొన్నారు.

ఉచిత సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

విద్యా హక్కు చట్టం ప్రకారం 2025-26 విద్యా సంవత్సరానికి మండలంలోని ప్రయివేట్, ఎయిడెడ్ పాఠశాలలో 1వ తరగతిలో ఉచితంగా 25 శాతం సీట్లును కేటాయించడం జరిగిందని ఎంఇఒ పద్మావతి అన్నారు. సంబంధించిన ఉచిత అడ్మిషన్లు ప్రారంభమై రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని, అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సిబిఎస్ఇ, ఐసిఎస్ఇ, ఐబీ పాఠ్యాంశాలను అనుసరిస్తున్న పాఠశాలలో ప్రవేశం కోసం విద్యార్థి ఏప్రిల్ 1, 2018 నుంచి మార్చి 31, 2019 మధ్య జన్మించి 6 సంవత్సరాలు నిండి ఉండాలన్నారు. స్టేట్ పాఠ్యాంశాలను అనుసరిస్తున్న పాఠశాలలో ప్రవేశం కోసం విద్యార్థి జూన్ 1, 2019 నుంచి మే 31, 2020 మధ్య జన్మించి 5 సంవత్సరాలు నిండి ఉండాలన్నారు. ఆరు అంచెల నిర్ధారణ ద్వారా విద్యార్థుల అర్హతలు ధ్రువీకరించబడతాయని తెలిపారు. అనాథపిల్లలు, హెచ్ఐవి బాధ్యులు, విభిన్న ప్రతిభావంతులకు 5 శాతం, షెడ్యూల్ కులాలకు - 10 శాతం, షెడ్యూల్ తెగలకు -4శాతం, బలహీన వర్గాలకు చెందిన బిసి, మైనార్టీ ఒసి (గ్రామీణ ప్రాంత కుటుంబాలకు సంవత్సర ఆదాయం రూ.1.20లక్షలు, పట్టణ ప్రాంత కుటుంబాలకు రూ.1.44లక్షలు లోబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులకు 6శాతం మొత్తంగా 25శాతం సీట్లను ప్రతి ప్రయివేట్, ఎయిడెడ్ పాఠశాలలో కల్పించబడునని వివరించారు. మండల పరిధిలో ఉన్న ప్రయివేట్ పాఠశాల విజయవాణి ప్రాథమికోన్నత పాఠశాల, కేశవరెడ్డి ప్రాథమిక పాఠశాలకు అర్హులైన విద్యార్థులు ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 28 నుంచి మే 15వ తేదీ లోపల దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందన్నారు. www.cse.ap.gov.in వెబ్ సైట్ ను సంప్రదించి ఆన్ లైన్‌లో, లేదా సచివాలయంలో కానీ, మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో కానీ, మీసేవ కేంద్రాలలో కానీ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఎంఇఒ కోరారు.

లేబాకలో నాకాబంది

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని లేబాక గ్రామంలో శనివారం నాకాబంది నిర్వహించినట్లు రాజంపేట రూరల్ సిఐ బివి.రమణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అడిషనల్ ఎస్పి వెంకటాద్రి సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిఎ చేపట్టడం జరిగిందని తెలిపారు. నాకాబంది సందర్భంగా గ్రామస్తులకు గ్రామంలో జరిగే అవాంఛనీయ సంఘటనలు, మైనర్ డ్రైవింగ్ గురించి కౌన్సిలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. రికార్డులో లేని 12 మోటార్ సైకిల్ ను పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎస్ఐ మోహన్ గౌడ్, హెడ్ కానిస్టేబుల్ రాజగోపాల్, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

అర్చకులతో మాట్లాడుతున్న ఐఒ కృష్ణారెడ్డి

దేవుడి మాన్యం భూములకు వేలం

ప్రజాశక్తి-చిట్వేలి

మండల పరిధిలోని ప్రముఖ దేవాలయాల పురాతన భూములు తరాల వారిగా గుత్త వేలంపాట జరుగుతుంది. శనివారం దేవాదాయశాఖ ఆధ్వర్యంలో మండలంలోని ప్రముఖ దేవాలయాలైన ఆంజనేయ స్వామి దేవాలయానికి సంబంధించి ఒక ఎకరా 62 సెంట్లు, సోమేశ్వర స్వామి దేవాలయం నాలుగు ఎకరములు, వరదరాజుల స్వామి, వీరభద్ర స్వామి దేవాలయాలకు సంబంధించి 22 ఎకరాలు మే 3న గుత్త వేలంపాట జరుగునని ఎండోమెంట్ అధికారి తెలిపారు. ఆసక్తి కలిగిన ప్రతి ఒక్కరూ పాల్గొనవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎండోమెంట్ ఇఒ కొండారెడ్డి, ఇన్స్పెక్టర్ జనార్ధన్, ఆలయాల పురోహితులు అరవిందస్వామి, సురేంద్ర, పవన్, సోమేశ్వరస్వామి ఆలయ చైర్మన్ వీరాంజనేయరాజు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఉర్దూ విద్యార్థులకు నగదు బహుమతి

ప్రజాశక్తి-కడప అర్బన్

నకాష్‌లో ఉన్న ఉర్దూ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు పదవ తరగతిలో 100 ఉత్తీర్ణత సాధించడంతోపాటు మంచి మార్కులు తెచ్చుకున్న ముగ్గురికి నగదు బహుమతి అందజేసినట్లు టిడిపి నగర ఉపాధ్యక్షులు మన్సూర్ అలీఖాన్ పేర్కొన్నారు. శనివారం విద్యార్థులకు ప్రధానోపాధ్యాయురాలు శకీరా బేగంఖాద్రి, చైర్మన్ గౌస్‌బాషా సమక్షంలో బహుమతి ప్రదాన కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా అలీఖాన్ మాట్లాడుతూ పదవ తరగతి ఫలితాల్లో స్కూల్ మొదటి స్థానంలో నిలిచిన షేక్. రూబియాకు రూ.10 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన షేక్ సుభానికి రూ.5 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన షేక్ సల్మాన్‌కు రూ.3 వేలు అందించినట్లు తెలిపారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు ఇచ్చిన హామీ మేరకు నగదు బహుమతి అందజేయడం సంతో షంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జమీల్, గౌస్ బాషా, నాయబ్ రసూల్, స్వాతి, కళావతి, రవిశంకర్, చాంద్ బాషా, టిడిపి నాయకులు జావిద్ బాష, షేక్. వాజిద్, రాఘవ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం

ప్రజాశక్తి - ముద్దనూరు

వైసిపి పాలనలో అప్పటి జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అభివృద్ధి మరిచి వనరులు సంపద దోచుకుని, ప్రజలను మోసం చేశారని ఎంపిటిసి లక్ష్మీ కాంతమ్మ ఆరోపించారు. శనివారం తన నివాసం వద్ద విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గత 5 ఏళ్ల వైసిపి పాలనలో సుధీర్‌రెడ్డి నియోజకవర్గంలోని సిమెంట్ కర్మాగారాలు, గనుల నుండి నెలకు దాదాపు రూ.2కోట్లు మామూళ్ల వసూలు చేసి దోచుకున్నారని ఆరోపించారు. ఆది నారాయణరెడ్డి హయాంలో నియోజకవర్గంలోని ప్రతి మండలంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు రాజుల సురేంద్రనాథ్‌రెడ్డి, ఉపాధ్యక్షులు రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సుండుపల్లిలో పడకేసిన పారిశుధ్యం

- చెత్తకుప్పలుగా మారిన డ్రెయినేజీ కాలువలు
- పట్టని అధికారులు

వ్యర్థాలతో నిండిపోయిన మురుగు కాలువ

రోడ్లపై పారుతున్న మురుగు నీరు

ప్రజాశక్తి-సుండుపల్లి

మండల కేంద్రమైన సుండుపల్లిలో పారిశుధ్యం పడకేసింది. రోడ్లపై చెత్తా చెత్తారంతో నిండిపోయింది. మురుగు కాలువల్లో చెత్త పేరుకపోయి చెత్తకుప్పలుగా దర్శనిమస్తున్నాయి. పారిశుధ్య లోపం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు కాలువలు నిండిపోయి మురుగు నీరంతా రోడ్లపై పారుతుండటంతో దుర్వాసనను భరించల లేకపోతున్నామని ప్రజలు వాపోతున్నారు. మురుగు నీరు నిల్వ ఉండటంతో వల్ల దోమలు వృద్ధి చెంది ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నారని అన్నారు. గత పదేళ్ల నుంచి సుండుపల్లె, ఈడికి పల్లె పంచాయతీలకు సర్పంచ్ ఎన్నికలు జరగలేదని అన్నారు. దీంతో పారిశుధ్యాన్ని పట్టించుకునే వారు లేరని అన్నారు. రోడ్లు అధ్వాన్నంగా మారాయని, ముగురు కాలువలు పొంగిపోర్లి వ్యర్థమైన నీరంతా రోడ్లపై చేరి ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. పారిశుధ్యాన్ని మెరుగు పరచాలని గ్రామపంచాయతీ అధికారులు, సెక్రటేరియట్ల దృష్టికి తీసుకెళ్లినా ఏ మాత్రం పట్టించుకోవడం లేదని అన్నారు. సిఎం చంద్రబాబు ప్రతి మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని పాటించాలని, ఎక్కడా అపరిశుభ్రత లేకుండా చూడాలచాని ఆదేశాలిచ్చినా ఇక్కడ మాత్రం అమలు కావడం లేదని అన్నారు. పంచాయతీ అధికారులు ఇప్పటికైనా స్పందించి సుండుపల్లిలో డ్రెయినేజీ కాలువలను శుభ్రం చేయించి, వ్యాధులు ప్రబలకుండా బ్లీసింగ్ చల్లించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరుతున్నారు.

రీసర్వేలో తన భూమిని తారుమారు చేశారు

- ఉరితాడుతో తహశీల్దార్ కార్యాలయం ఎదుట రైతు నిరసన

తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేస్తున్న రైతు సుదర్శన్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

రీసర్వేలో తన భూమిని తారుమారు చేశారని మండలంలోని గండువారిపల్లికి చెందిన రైతు సుదర్శన్ తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఉరితాడు వినూత్నంగా నిరసన చేపట్టారు. ఈ సదర్భంగా ఆయన తనకు సర్వే నెంబర్ 797లో రెండు భూమి ఉందని, రీసర్వేలో తన భూమిని రెవిన్యూ అధికారులు తారుమారు చేశారని అన్నారు. 1బి, అడంగల్ కూడా రావడం లేదని, ఈవిషయమై పలుమార్లు తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయిందని అన్నారు. గతంలో కూడా తాను పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య ప్రయత్నం చేయగా సమస్యను పరిష్కారిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారని అన్నారు. కానీ ఇంతవరకు న్యాయం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు వంశపారంపర్యంగా వస్తున్న భూమిని ఆన్‌లైన్ చేయడానికి అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన భూమికి సంబంధించిన పట్టాదారు పాస్ బుక్ బ్యాంకులో పెడితే రుణం వస్తుందని, దాంతో కూతురు చదువు కోసం, భూమి సాగు చేసుకోవచ్చని తెలిపారు. అధికారులు సమస్యను పరిష్కరించకపోతే ఆత్మహత్యే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వేయర్ ముబారక్ వచ్చి 29వ తేదీన అందరినీ పిలిచి నీకు న్యాయం చేస్తామని రైతుకు హామీనిచ్చారు. సర్వేయర్ హామీనివ్వడంతో సుదర్శన్ నిరసన విరమించారు. ఇప్పటికైనా రీ సర్వేలో దొర్లిన తప్పులను రెవెన్యూ అధికారులు సరిదిద్దాలని మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉత్తమ విద్యార్థులకు గురువుల ప్రశంసలు

విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-పీలేరు

పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు డాక్టర్ నటరాజన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ప్రశంసించారు. పీలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో గురువులు మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షల్లో చరిత్రాత్మక విజయం సాధించి విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని అన్నారు. పీలేరు మండల పరిధిలో 15 ప్రభుత్వ పాఠశాలలుండగా, పీలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఎన్. భానుశేఖర్ రెడ్డి 581 మార్కులు సాధించి మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచాడని అన్నారు. ఆ తర్వాతి స్థానాల్లో వరుసగా ఫలితాలు సాధించిన కె. హితేష్ - 546, ఎస్. ఉజ్రకుస్లమ్ -544, బి. హరిప్రియ -535, ఎస్. మదియా బాను -532, పిజి స్నిగ్ధ -529, ఎస్. తస్లీమ్-528, ఎస్. సుహాన -523, ఈ. శరణ్య-516, ఎస్. సైదానీబీ -513, ఎస్. అతుఫా రహమత్ - 506, ఎస్. మొహమ్మద్ ఫరూక్ - 504 లను కూడా అభినందించినట్లు తెలిపారు. 1937లో స్తాపించిన ఈ పాఠశాల ఇప్పటికీ వన్నె తగ్గకుండా ఇంతటి చరిత్రాత్మక విజయాలు సాధించడం గర్వకారణమని తెలిపారు. ఎందరో మహాను భావులు ఈ పాఠశాలలో చదివి ఉన్నత స్థాయిలో ఉన్నారంటూ గత స్మృతులను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థి తల్లి తండ్రులు భారతి, ఉత్తమ రెడ్డి, ఉపాధ్యాయులు శిరీష, లీలావతి, శశిదేవి, జీనత్, షరీఫున్నిస, నాగవేణి, యర్రయ్య, జనార్ధన్ రెడ్డి, శివకుమార్, రమణ, గౌస్, కిషోర్, బాలాజీ, విద్యార్థులు పాల్గొన్నారు.

'పది'లో సత్తా చాటిన గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ప్రతిభ చూపిన విద్యార్థులు

ప్రభుత్వం ఇటీ వల విడుదల చేసిన పదవ తరగతి ఫలితాలలో మండలంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించి సత్తా చాటారు. గిరిజన ఆశ్రమ పాఠ శాలలో పదవ తరగతి చదువుతున్న పి.బ్రహ్మయ్య 479 మార్కులు, పెద్ద రాజు 473, వి.నవీన్ కుమార్-449 మార్కులు సాధించి పాఠశాలలో మొదటి మూడు స్థానాలలో నిలిచారని ప్రధానోపాధ్యాయులు హెచ్.వెంకటరమణ తెలిపారు. 14 మంది పరీక్షలకు హాజరవ్వగా 14 మంది ఉత్తీర్ణులై 100 శాతం ఉత్తీర్ణత శాతం సాధించారని అన్నారు. 12 మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులవ్వగా, ఇద్దరు విద్యార్థులు ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. పందశాతం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ప్రధానో పాధ్యాయులతో పాటు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ఫారం పాండ్ పనులు పరిశీలించిన పీడీ

ప్రజాశక్తి-కలకడ

మండలంలో జరుగుతున్న ఫారంపాండ్ పనులను డ్వామా పీడీ వెంకటరత్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలోని గంగాపురం పంచాయతీ షేర్‌ఖాన్ వంక వద్ద జరుగుతున్న ఫారంపాండ్ పనులను పరిశీలించి నాణ్యతపై ఆరాతీశారు. పనులను కూలీలు చేస్తున్న పేరును హాజరును పరిశీలించినట్లు తెలిపారు. పనులలో నాణ్యతను కలిగి ఉండాలని, కూలీలు అడిగిన చోటనే పనులు కల్పించాలని, వారికి నీరు నీడ ఏర్పాటు చేయాలని సూచించినట్లు తెలిపారు. ప్రథమ చికిత్స కిట్స్ అందు బాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కూలీలు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్త చర్యలు పాటించాలని తెలిపారు. ఫారంపాండ్ పనులు పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎపిఒ సుజాత, ఇసి నాగవేణి, టిఎ.రాము నాయక్, ఎఫ్ఎ బాలాజీ పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న పీడీ వెంకటరత్నం

పెట్రోల్ బంకు ఏర్పాటుకు స్థల పరిశీలన

స్థల పరిశీలన చేస్తున్న రెవెన్యూ, ఐబసి ప్రతినిధులు

ప్రజాశక్తి-పీలేరు

మండలంలోని గూడరేవుపల్లి పంచాయతీ, సర్వేనెంబర్ 198లో ఐఒసీ పెట్రోల్ బంక్ ఏర్పాటుకు రెవిన్యూ అధికారులు స్థల పరిశీలన చేశారు. శనివారం తహశీల్దార్, రెవెన్యూ బృందం స్థల పరిశీలన తర్వాత విలేకర్లతో మాట్లాడారు. ఐఒసి పెట్రోల్ బంకు నిర్మాణానికి తగిన స్థల ప్రతిపాదన చేశామని అన్నారు. ఈ సందర్భంగా వచ్చిన ఐఒసి సంస్థ ప్రతినిధులు ప్రతిపాదిత స్థలాన్ని చూపించినట్లు తెలిపారు. పెట్రోల్ బంకు ఇక్కడ ఏర్పాటైతే వాహనదారులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. ఈ మేరకు ప్రతిపాదించిన స్థలాన్ని జిల్లా అనుమతుల కోసం నివేదికను ఉన్నత అధికారులకు పంపుతామని తహశీల్దారు తెలిపారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్, శ్రీనివాసులు, విఆర్ఒ హేమంత్‌నాయక్ పాల్గొన్నారు.

విసిలో పాల్గొన్న ఎంపిడిఒ , అధికారులు

తాగునీటి సమస్య లేకుండా చూడాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-చిట్వేలి

మండల పరిధిలోని ఎంపిడిఒ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో ఎంపిడిఒ ఎ.మోహన్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శానిటేషన్ హౌసింగ్ ముఖ్యంగా తాగునీటిపైన ప్రత్యేకంగా దృష్టి సాధించాలని అన్నారు. మే నెలలో అధిక ఉష్ణోగ్రతలు వెలువడే అవకాశం ఉన్నందున గ్రామాల్లో సమిష్టిక తాగనీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వడగాలుల నుంచి వృద్ధులు, చిన్నపిల్లల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకునేలా అవగాహన కల్పిస్తూ, ఉపాధి కూలీలు వీలైనంత త్వరగా ఉదయం వేళలో పని ముగిం చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

రామేశ్వరరెడ్డికి డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి - చాపాడు

వైదుకూరు డిగ్రీ కళాశాలలో చరిత్ర అధ్యాప కులుగా పనిచేస్తున్న పి.రామేశ్వరరెడ్డికి ద్రవిడయన్ యూనివర్సిటీ, కుప్పం డాక్టరేట్ ప్రదానం చేసింది. డాక్టర్ బిఆర్ ప్రసాద్‌రెడ్డి పర్యవేక్షణలో విజయనగర సామ్రాజ్యం కింద దక్షిణ భారతదేశంలో సామాజిక ఆర్థిక, సాంస్కృతిక అభివృద్ధి అనే అంశంపై పరిశోధనకు పిహెచ్‌డి అవార్డు ప్రదానం చేశారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి, సిబ్బంది అభినందనలు తెలిపారు.

అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-బి.కొత్తకోట

బురకాయలకోట యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ సభ్యులు భాస్కర్ స్నేహితురాలు రూపకళ పుట్టినరోజుని పురస్కరించుకొని శనివారం బెంగుళూరు నగరంలోని శబరి ఆశ్రమంలోని 80 మంది వృద్ధులు పిల్లలకు అన్నదానం,మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు రాజశేఖర్ మాట్లాడుతూ అన్నదానం గొప్పదని అన్నారు. ప్రతి ఒక్కరూ పుట్టినరోజు,పెళ్లిరోజు వేడుకలు నిరాడంబరంగా జరుపుకొని అందుకు ఖర్చు చేసే సొమ్ముతో సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పుట్టినరోజు వేళ ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించిన రూపకళను అభినందించారు. కార్యక్రమంలో రూపకళ, మౌనిక, భాస్కర్, రాజు పాల్గొన్నారు.

పాలిసెట్ ప్రవేశ పరీక్షకు సిద్ధం కావాలి

ప్రజాశక్తి-కలికిరి

డిప్లొమా కోర్సుల్లో అడ్మిషన్ల కోసం ఈ నెల 30న పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.శ్రీనివాసులు తెలిపారు. పరీక్షలు రాసేందుకు విద్యార్థులు సంసిద్ధంగా ఉండాలని కోరారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్లను www.polycetap.nic.in వెబ్ సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆయన సూచించారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో నుజ్జు నుజ్జు అయిన బొలెరో వాహనం

బొలెరోను ఢీకొన్న ఆర్‌టిసి బస్సు

- ఒకరు మృతి, పలువురికి గాయాలు

ప్రజాశక్తి-రామాపురం

మండల పరిధిలోని బండపల్లి టోల్ ప్లాజా సమీపంలో శనివారం రాయచోటి డిపో చెందిన ఆర్‌టిసి బస్సు నిలబడి ఉన్న బొలెరో వాహానాన్ని ఢీకొనడంతో ఒక మృతి చెందగా పలువురికి గాయాలు అయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. వంగిమల్ల నుంచి రాయచోటికి పోతున్న ఆర్‌టిసి బస్సు బండపల్లి సమీపంలో ఉన్న టోల్గేట్ సమీపంలో బొలెరో వాహనాన్ని బలంగా ఢీకొట్టిందని తెలిపారు. ఈ ప్రమాదంలో బస్సులు ప్రయాణిస్తున్న పలువురికి గాయాలు కాగా, పొలిమేరపల్లి చెందిన మాదిరెడ్డి రామాంజనేయరెడ్డి(80) చికిత్స పొందుతూ మృతి చెందాడని తెలిపారు. ఆర్‌టిసి బస్సు డ్రైవర్ ప్రసాద్‌రెడ్డి, కండక్టర్ నర్సింహులు, ఆస్మారెడ్డి, రాణి, విజయకుమార్‌రెడ్డి, మణిత్వా, మహేష్, రాణమ్మ, ఉప్పరపల్లికు చెందిన చౌడయ్య, సుమిత్ర, జమునకు గాయాలయ్యాయని తెలిపారు. గాయపడిన వారిని రాయచోటి ప్రభుత్వ తరలించామని, మరి కొందరి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో కడప రిమ్స్ పంపినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రామాపురం ఎస్ఐ వెంకట సుధాకర్ రెడ్డి తెలిపారు. రోడ్డుకు అడ్డంగా పడి ఉన్న వాహనాలను తొలగించి రాకపోకలను పునరుద్ధరించినట్లు తెలిపారు.

బాధితులకు సహాయక చర్యలు చేపట్టండి : మంత్రి

రాయచోటి :ఆర్‌టిసి బస్సు, బొలెరో ఢీకొని 14, మందికి తీవ్ర గాయాలయ్యాయి గాయపడిన వారిని వెంటనే రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం అందించాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అధికారులకు ఫోన్ చేసి తెలిపారు. గాయపడిన వారిలో 8 మంది పురుషులు, నలుగురు మహిళలు, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. ఇందులో తీవ్ర గాయాలయిన ఐదుగురిని తిరుపతి, కడప రిమ్స్‌కు తరలించారు. క్షతగాత్రులను వెంటనే ఆసుపత్రికి తరలించి వారికి మెరుగైన వైద్య సేవలు అందించాల ఆర్‌టిసి అధికారులకు, వైద్యులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగింది. అధికారులు సహాయక చర్యలు వేగవంతం చేశారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

నిశ్చయమైన వివాహం రద్దు కావడంతో ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన శనివారం మదనపల్లె పట్టణంలో జరిగింది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మదనపల్లె పట్టణం, నీరుగుట్టువారిపల్లి రామిరెడ్డి లేఅవుట్‌కు చెందిన నరసింహులు కుమారుడు మల్లికార్జునకు ఇటీవల ఓ యువతితో వివాహం నిశ్చయమైంది. మరికొద్ది రోజుల్లో వివాహం కావాల్సి ఉండగా పెళ్లి కుమార్తె తరపు వారు వివాహాన్ని రద్దు చేసుకున్నారు. తమకు ఈ వివాహం ఇష్టం లేదని, బిడ్డని ఇవ్వమని ఖరాకండిగా చెప్పారు. నిశ్చయమైన పెళ్లి రద్దు కావడంతో తీవ్ర మనస్తాపానికి గురైన మల్లికార్జున నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితున్ని మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఒకటో పట్టణ పోలీసులు విచారణ చేపట్టారు.

రైలు కింద పడి మహిళ మృతి

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని దేవసముద్రం వడ్డిపల్లికి చెందిన పసుపులేటి సీతమ్మ శనివారం ఉదు ముపారిపల్లికి సమీపంలో రైల్వే ట్రాక్ పై పడి మృతి చెందింది. ఆమె మృతిఇన తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. సీతమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందించారు. ఈ ఘటనపై రేణిగుంట రైల్వే పోలీస్ గౌరీ శంకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సిసి కెమెరాలు చోరీ

- పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి-కలకడ

చోరీకి గురైన సీసీ కెమెరా

సిసి కెమెరాలు చోరీ కాగా పోలీసులకు ఫిర్యాదు చేసిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. మండల కేంద్రమైన కలకడ ఆదర్శ పాఠశాలలో సిసి కెమెరాలను అమర్చారు. పాఠశాల ఆవరణములోకి ఎవరు వస్తున్నారు, ఎవరు పోతున్నారు, ఏమి చేస్తున్నారనే విషయాలను తెలుసుకునేందుకు సిసి కెమెరాలు ఏర్పాటు చేశారు. 25వ తేదీన రాత్రి 8 గంటల సమయంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాలకు ముందుభాగం రెండు కెమెరాలు దొంగలించినట్లు వాచ్‌మెన్ రామానుజులు గమనించిన తెలిపారు. రామానుజులు భోజనం చేయడానికి దగ్గరలో ఉన్న ఇంటికి వెళ్లి వచ్చేసరికి గుర్తుతెలియని దుండగులు రెండు సిసి కెమెరాలు చోరీకి గురైనట్లు గుర్తించామని తెలిపారు. వెంటనే ప్రిన్సిపల్‌కు విషయం వివరించగా ప్రిన్సిపాల్ ఆదేశాల మేరకు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వాచ్‌మెన్ రామానుజన్ తెలిపారు.